ప్రజాశక్తి
సోమవారం 1 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసు కోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆఫ్‌షోర్' నిర్వాసితులకు తిప్పలు

- నిర్మాణానికి నోచుకోని మురుగు కాలువలు, సిసి రోడ్లు
- అసంపూర్తిగా భవన నిర్మాణాలు
- పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నివాసగృహాలతో పాటు ఆధారపడిన పంట భూములను త్యాగం చేసిన ఆఫ్‌షోర్ నిర్వాసితులకు తిప్పలు తప్పడం లేదు. నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. నిర్వాసిత కాలనీలో అభివృద్ధి పనులు ఎక్కడెక్కడ నిలిచిపోయాయి. దీంతో అవస్థలు పడుతున్నారు. నిర్వాసితుల కాలనీ అభివృద్ధికి కేటాయించిన నిధులు గత ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో చేసిన పనులకు సంబంధించి ఒక్క రూపాయీ చెల్లించకపోవడంతో ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి.

ప్రజాశక్తి - పలాస

మౌలిక వసతులకు నోచుకోని నిర్వాసిత కాలనీ

మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులతో రేగులపాడు, నందిగాం, మెళియాపుట్టి మండలంలోని శారదాపురం, చిన్నగురువూరు, చీపురుపల్లి, దాసుపురం తదితర ప్రాంత ప్రజలు తమ పంట భూములతో పాటు నివాస గృహాలను ఖాళీ చేశారు. ప్రభుత్వం నిర్వాసితులకు డబ్బులతో పాటు స్థలాన్ని కేటాయించింది. అందులో భాగంగానే పలాస మండలం రామకృష్ణాపురం, గోపీవల్లభపురం, మెళియాపుట్టి మండలం దాసుపురం రెవెన్యూ పరిధిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. 250 ప్లాట్లు ఏర్పాటు చేసి నిర్వాసితులకు అప్పగించింది. ప్రస్తుతం శారదపురంలోని 109 కుటుంబాలు, చిన్నగురువులు 34 కుటుంబాలు, రేగులపాడు 40 కుటుంబాలు, చీపురుపల్లిలో 64 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాలు చేసేందుకు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం కొన్ని కుటుంబాలు గృహ నిర్మాణ పనులు చేపట్టాయి. ఈ ప్రాంతంలో సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యం, పంచాయతీ కార్యాలయం భవనం, అంగన్వాడీ భవనం, పాఠశాల భవనం, ఆలయం, కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు ఎపిడబ్ల్యుఆర్ఐడిసి పథకం కింద సుమారు రూ.5 కోట్లు నిధులు కేటాయించారు. పలాస మండలం రామకృష్ణాపురం, మెళియాపుట్టి మండలం దాసుపురం నిర్వాసితుల కాలనీలో యుపి పాఠశాల, అంగన్వాడీ భవనం, కమ్యూనిటీ భవనం, పంచాయతీ కార్యాలయ భవనం పనులు ప్రారంభించి ఏళ్లు కావస్తున్నా అసంపూర్తిగా నిలిచిపోయాయి.

భూములు, రేషన్, పింఛన్లు అక్కడ.... కాలనీ వాసులు ఎక్కడ

నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోయినా... ఇళ్లు నిర్మించకపోవడంతో నిర్వాసిత కాలనీలో నివసిస్తున్నారు. కానీ, వారి భూములు, తోటలు, రేషన్ కార్డులు పింఛన్లు వారి సొంత గ్రామాల్లో ఉండడంతో నిత్యం ఏ అవసరం వచ్చినా కాలనీ నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వారి సొంత గ్రామాలకు వెళ్లి పనులు చేయించుకొనే పరిస్థితి నెలకొంది. నిత్యం తమ పంట భూములు చూసుకోలే, అక్కడికి వెళ్లలేక ఏం జరుగుతుందో తెలియక కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రేషన్ కోసం అంతదూరం ప్రయాణించి తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల కోసం సొంత గ్రామాలకు వెళ్తున్నామని చెబుతున్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి

ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసిత ఆర్అండ్ ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశాం. అందులో రూ.2 కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టాం. అయితే చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం చేస్తాం.

- కె.రామారావు, ఎపిఇడబ్ల్యుఐడిసి ఎఇ

విద్యకు దూరం

నిర్వాసిత కాలనీలో అన్ని అసంపూర్తిగా ఉండటంతో కాలనీలో నివసిస్తున్న విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కాలనీలో పాఠశాల ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పడంతో తాము కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టి నివాసముంటున్నమని ఇక్కడ చూస్తే పాఠశాల కాదు కదా మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మా ప్రాంత వాసులు అంతా కలిసి రెండు ఆటోలను మాట్లాడుకొని కాశీబుగ్గ, కోసంగిపురం, తదితర ప్రభుత్వ పాఠశాలలకు, మరి కొంతమంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు అధికారుల మాటలు విని మా పిల్లల భవిష్యత్ తామే చేతులారా పోగొట్టుకుని పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టాలు ఇచ్చారు... రిజిస్ట్రేషన్ లేదు

నిర్వాసితులు తమ భూములు, తోటలు, నివాసగృహాలు సైతం కోల్పోయారు. వారికి ప్రభుత్వం నష్టపరిహారంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు మంజూరు చేసింది. పట్టాలు మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ లబ్ధిదారుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయలేదు. పట్టాలు ఇచ్చి మూడేళ్లకే తమ తమ పేర్లతో ఎలివేషన్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ, నేటికీ మా పేర్లతో రిజిస్ట్రేషన్ కాలేదని నిర్వాసితులు చెబుతున్నారు. రిజర్వాయరుకు అనుకున్న సమయానికి పూర్తి చేయకపోతే నిర్వాసితులకు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని చట్టాల్లో ఉందని, కానీ, ప్రస్తుత పాలకులు, అధికారులు మా పేరుపై రిజిస్ట్రేషన్ చేయడం లేదు సరికదా కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించలేదు

మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, పలాస మండలం రామకృష్ణాపురం ఆర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. వీధి దీపాలు సైతం వేయడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో నివసించడం కష్టంగా ఉంది. శ్మశాన వాటికకు నిర్దిష్టమైన స్థలం కూడా కేటాయించలేదు. చీపురుపల్లికి చెందిన శివాలయం, గ్రామ దేవతలకు సుమారు 3.50 ఎకరాలు భూములు ఉన్నాయి. ఆ భూములకు నష్టపరిహారం చెల్లించలేదు.

- ఇప్పిలి కృష్ణారావు, రామకృష్ణాపురం

నివశించడం కష్టంగా ఉంది

కాలనీలో ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. వీధుల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టలేదు. తాగునీరు సరఫరా లేదు. అంగన్వాడీ, పాఠశాల లేదు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కాలనీలో ఉంటున్నాం. నివసించడానికి కష్టంగా ఉంది.

- యవ్వారి మహాలక్ష్మి, శారదాపురం, నందిగాం మండలం

అధ్వానంగా కాలనీ

పలాస మండలం గోపీవల్లభపురం కాలనీ అధ్వానంగా ఉంది. కాలనీలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు బురదతో నిండిపోతుంది. కాలనీలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవు. కాలనీలో ఇబ్బందులు పడి జీవనం సాగిస్తున్నాం. మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు పదేపదే కోరుతున్నా ఫలితం లేకపోయింది.

- అంబలి అప్పలస్వామి, రేగులపాడు పలాస మండలం

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు మణికొండ ఆదినారాయణమూర్తి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14న పాతపట్నంలో నిర్వహించన్ను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2023 డిసెంబరు 2024 జనవరిలో చేసిన 42 రోజులు సమ్మె పోరాటం చారిత్రాత్మకమైనదని అన్నారు. ఆ సమ్మె సందర్భంగా గతేడాది జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని ఇప్పటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ఆరేళ్లలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పనిభారం పెరిగిందని, కానీ ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు డిఎ కానీ, పిఆర్‌సి కానీ అమలు చేయాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అంగన్వాడీలకు ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలన్నారు. సెంటరు నిర్వహణకు నాణ్యమైన ట్యాబులు ఇచ్చి 5జి నెట్ ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని అంగన్వాడీలు అప్పగించరాదన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. గ్రాట్యూటీ జిఒలో మార్పులు చేయాలన్నారు. సిఐటియు శ్రీకాకుళం నగర్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమన్నారు. ఈ మహసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ గౌరవాధ్యక్షునిగా కె.జ్యోతి, అధ్యక్షునిగా టి.రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కె.కళ్యాణి, ఉపాధ్యక్షులుగా పి.సంధ్యారాణి, కె.ఆదిలక్ష్మి, జి.పావని, సహాయ కార్యదర్శులుగా కె.పార్వతి, డి.ముత్యాలమ్మ, రమణమ్మ, మల్లీశ్వరి, అప్పలనర్సమ్మలతో పాటు 19 మందిని ఎన్నుకున్నారు.

మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉద్యోగభద్రత కల్పించాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. హెచ్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ ఉన్న సాంకేతిక సమస్యలు పరిష్కారం చేయకుండా, చిరు ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తామంటూ ఆదేశాలు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా, నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. వేతనాలు తగ్గిస్తూ జూన్ ఆరున ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 357 ద్వారా అన్యాయం చేస్తున్నారన్నారు. యుపిహెచ్‌సి ఉద్యోగులు అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వేతనాల్లో తీవ్ర వ్యత్యాసం వల్ల అన్యాయానికి గురవుతున్నామని, వార్షిక ఇంక్రిమెంట్స్, పర్మామెన్స్ ఇంక్రిమెంట్స్, ఉద్యోగ విరమణ సౌకర్యాలు, పరస్పర ఒప్పంద, స్పష్టమైన ఖాళీల్లో బదిలీలు చేపట్టాలని అన్నారు. ఉద్యోగుల విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగులంతా ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్షునిగా మాలతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సూర్య ప్రవీణ్, కోశాధికారిగా ఉపేంద్ర, వర్కింగ్ ఉమెన్ అధ్యక్షురాలుగా కళ్యాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా బి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుధాకర్, జి.జె.లత, రాజ్యలక్ష్మి, మహేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహాలక్ష్మి

మహాసభను విజయవంతం చేయాలి

మందస : ఈ నెల 13, 14 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఎంఇఒ కార్యాలయంలో మండల కార్యదర్శి కె.ప్రభావతి అధ్యక్షతన వంట కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మహాసభలో డిమాండ్లు, భవిష్యత్ పోరాటాలపై రూపొందిస్తామని అన్నారు. వంట కార్మికులకు కనీస వేతనం రూ.పది వేలు అమలు చేయాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాల న్నారు. ప్రతినెలా 5లోపు వేతనాలు చెల్లించాలన్నారు. మెనూ ఛార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కె.ప్రభావతి, ఎ.రాము, జ్యోతి, లక్ష్మి, శకుంతల, పావని, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆయాలను ఉద్యోగులుగా గుర్తించాలి

సోంపేట : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు (ఆయా)లను, మధ్యాహ్న భోజన వంట కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాజకీయ వేధింపులతొలగింపులు ఆపాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోంపేటలో ఆయాలతో, వంట కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కంచిలి మండలం కార్యదర్శి కె.కౌసల్య, ఎస్.శ్యామల, కె.సత్యవతి, బి.మీనా తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఒత్తిడి స్థాయిని తగ్గించడంలో, శారీరక దృఢత్వాన్ని పెంపొందిం చడంలో క్రీడలు, శారీరక కార్యకలాపాల ప్రాధాన్యతను పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు వివరించారు. సైక్లింగ్‌ను జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా పోస్టల్‌శాఖ ఆధ్వర్యాన రోజూ గంట మైదానంలో ఆడండి అనే థీమ్‌తో ఫిట్ ఇండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నగరంలోని పోస్టల్ డివిజన్ ఆధ్వర్యాన ఫిట్ ఇండియాలో భాగంగా ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గత మూడు రోజులుగా ఫిట్నెస్ ప్రతిజ్ఞలు, విద్యార్థులతో చర్చలు వంటి కార్యక్రమాలు చేపట్టిన తపాలాశాఖ, ఈ ఆదివారం ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో సైకిల్ ర్యాలీతో కార్యక్రమాలను ముగించింది.

సైకిల్ ర్యాలీలో పోస్టల్ సిబ్బంది

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హరికృష్ణ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల సూచనలు, ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గోరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన వారిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేసిందన్నారు.

కొత్తూరులో భారీ వర్షం

కొత్తూరు : కొత్తూరులో ఆదివారం సాయంత్రం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై, కాలువల్లో నీరు చేరడంలో జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పగలంతా ఎండ వేడితో, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం కలిగినట్లయింది. పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.

కురుస్తున్న వర్షం

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో శద్ధి జల ప్లాంట్‌ను ఆదివారం సుడా అధ్యక్షులు కొరిగాన రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) సౌజన్యంతో శ్రీకాకుళం ఆర్‌టిసి ఆర్టీసీ బస్ స్టేషన్ కాంప్లెక్స్ ఆవరణలో సుమారు రూ.5 లక్షల విలువ గల శద్ధ జల ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం విజయవంతంగా నడుస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ సుమారు 80 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్ఒ ప్లాంట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ, శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు, డిఇ (సివిల్) ఎస్ఇ సుగుణాకర్, ఫారెస్టు డైరెక్టర్ గేదెల చైతన్య, పిఆర్ఒ శ్రీనివాస్, ఎస్.ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

వ్యవసాయ, అనుబంధ

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- గిరిజన ప్రాంతాల్లో ఉద్యానవన పంటలకు ఊతం
- స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందజేత
- నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజర్ రమేష్ కృష్ణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నాబార్డు ద్వారా వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించనున్నట్లు నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజర్ కత్తిమంట రమేష్ కృష్ణ తెలిపారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో రైతులకు వారు పండించిన ఉత్పత్తుల అమ్ముకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సంఘాలు ఏర్పాటు ప్రోత్సహించి, రైతులకు రుణాల అందిస్తున్నట్లు చెప్పారు. నాబార్డు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.

? నాబార్డు ఎటువంటి రుణ సహాయం అందజేస్తుంది?

నాబార్డు పంట రుణాలు తక్కువ వడ్డీ రేటుకు అందజేస్తుంది. సాధారణ వడ్డీ ఏడు శాతం కాగా, నాలుగు శాతాలకు రుణాలు అందజేస్తుంది. పంట దెబ్బతింటే పునర్ వినియోగానికి రెండు శాతానికే రణం అందజేస్తుంది. రైతులు ఫార్మర్ ప్రోడ్యూషర్ అర్గనైజేషన్ సంఘాలుగా ఏర్పడితే ప్రయోజనం ఉంటుంది. పది మంది ఈ సంఘాలుగా ఏర్పడవచ్చు. సముదాయంగా వ్యవసాయం, ఉత్పత్తి వల్ల ప్రయోజనం ఉంటుంది.

? సంఘాల వల్ల ప్రయోజనం ఏమిటి?

ఈ సంఘాల్లో ఉన్నవారికి శిక్షణ ఇచ్చి రుణాలు అందజేస్తాం. వ్యవసాయ ఉత్పత్తులకు, మార్కెటింగ్‌కు రుణాలు అందజేస్తాం. మార్కెటింగ్ లింకేలు వల్ల సూచియా, మైనింగ్, ప్రోత్సాహక క్రడిట్, గ్రాంట్లు, సబ్సిడీలు వంటి ప్రయోజనాలు లభిస్తాయి. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించటం లక్ష్యం. జిల్లాలో 26 ఎఫ్‌పిఒలు ఉన్నాయి. నాలుగు మాతోట ప్రాజెక్టులు ఉన్నాయి. విజయ వంతంగా నిర్వహణ సాగుతుంది.

? కిసాన్ క్రెడిట్ కార్డుల వల్ల ప్రయోజనం ఏమిటి?

కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నవారికి పంట సాగు, మార్కెటింగ్, ఇతర అవసరాలకు రుణాలు మంజూరు చేస్తాం. ముద్ర పథకం కింద రుణాలు ఇస్తాం. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు వల్ల ప్రయోజనం ఉంటుంది. వ్యవసాయ రంగం ప్రగతికి దోహదపడుతుంది.

? దీర్ఘకాలిక రుణాలు మంజూరు ఎలా ఉంటుంది?

15 ఏళ్లకు సైతం రుణాల అందజేస్తాం. సముదాయ, రీజనల్, సహకార బ్యాంకుల ద్వారా ఈ రుణాలు అందజేస్తాం. ఈ రుణాల వల్ల సబ్సిడీ, ప్రీ ఫైనాన్స్ ప్రయోజనాలు ఉంటాయి. డైరీ, ఫిషరీస్, మొక్కజొన్న వంటి అనుబంధ పరిశ్రమలకు ఈ రుణాలు అందజేస్తాం. రైతులను నూతన పంటల ఎంపికకు ప్రోత్సహిస్తాం. నాబార్డు ప్రోత్సాహం వల్ల పంట సాగు, వ్యాపారం నిర్వహన విజయ వంతంగా రైతులు చేస్తున్నారు.

? నాబార్డు వల్ల వ్యాపారంగాన్ని ఎలా ప్రోత్సహిస్తారు?

ప్రధానంగా ఔత్సాహిక వ్యవసాయ ఆధారిత వ్యాపారాలను ప్రోత్సహిస్తాం. శిక్షణ, కెపాసిటీ బిల్డింగ్స్‌పై అవగాహన, మార్కెటింగ్‌పై అవగాహన, కల్పిస్తాం. క్రెడిట్ గ్రాంట్లు, సబ్సిడీలు వంటి ప్రయోజనాలు కల్పిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఇది ప్రయోజనం. యువత నైపుణ్యాలు కల్పన వల్ల వ్యాపారంలో రాణిస్తారు.

? ఉద్యానవన సాగు ఎలా ప్రోత్సహిస్తున్నారు?

ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఈ సాగును ప్రోత్సహిస్తున్నాం. మా తోట ప్రాజెక్టులో భాగంగా మామిడి, పైనాపిల్, కెన్యు అంటే సాగును ప్రోత్సహిస్తున్నాం. కోల్డ్‌స్టోరేజ్, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రామీణ ప్రాంతాల్లో గదాములు ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తున్నాం. దీనివల్ల పంటలు దాచుకునే అవకాశం రైతులకు ఉంటుంది. ధర పలికేటప్పుడు అమ్ముకో వచ్చు. రైతులు నూతన పంటలు ఎంపికలు కీలకం. హైటెక్ పద్ధతులు వ్యవసాయ రంగంలో అవసరం.

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT : VISAKHAPATNAM
O.S. 1494/2023

Between:
M/s. Lakshmi Finance Private Limited, Rep.by its Special Power of Attorney Holder, Kondra Anand ...Plaintiff
And
Bammidi Rajani & others ...Defendants

SUMMONS

To,
D-1: Bammidi Rajani, W/o. Maheswara Rao, aged 34 years, R/at D.No.1-46, Kona Simhadri Peta, Main Street, Jalumuru, Srikakulam-532432.
D-3: Bammidi Maheswara Rao, S/o. Dalayya, aged 36 years, Rest-do-

Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **11-09-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **11-09-2025** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
TULALA VENKATESWARA RAO,
KURUMUJI KOTESWARA RAO,
Advocates, Visakhapatnam-530002

నినాదాలు చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

స్కూల్ శానిటేషన్ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పొందూరు

స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌కు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎపి పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర డిమాండ్ చేశారు. ఎపి పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం ఆదివారం స్థానిక నెహ్రూ పార్కు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, సరిపడా పనిముట్లు అందించాలని కోరారు. శానిటేషన్ కార్మికులకు నెలవారీ జీతాలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 5వ తేదీ లోపల వేతనం చెల్లించాలని కోరారు. వేసవి సెలవుల్లో సగం వేతనం కాకుండా పూర్తివేతనం ఇవ్వాలని కోరారు. హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రవి చూడని ప్రాంతాన్ని కవి చూడగలరు

ప్రజాశక్తి- నరసన్నపేట

సమాజానికి వెలుగు కవి అందువలనే రవి చూడని ప్రాంతాన్ని కూడా కవి చూడగలరని అంటారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సదాశివుని కృష్ణ ఆధ్వర్యాన రచయితల వేదిక ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ కవులు, కళాకారులు, రచయితలు లేనిదే ప్రపంచం లేదని అన్నారు. సమాజం నిర్మాణంలో వీరి పాత్ర అమోఘం అన్నారు. అనంతరం రచయితల వేదిక కార్యదర్శి భమిడిపాటి గౌరీశంకర్ రచించిన వివిధ పుస్తకాలను ఆవిష్కరించారు. అలాగే డాక్టర్ గొలివి మోహన్, రాణీ దంపతులను, మానాపురం వెంకట సత్య సోమశేఖర దంపతులను దుశ్శాలువలను కప్పి సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశిష్ట వక్తగా నిష్టల నరసింహమూర్తి, జోష్యుల ప్రసాద్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, జి.చిట్టిబాబు, భైరి భాస్కరరావు, తెలుగు ఉపాధ్యాయులు లక్కోజి గౌరీశంకర్ పాల్గొన్నారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

'అంతర్మథనం' గ్రంథం ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన ప్రముఖ కవి కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'అంతర్మథనం' వచన కవిత్వ సంపుటి ఆదివారం విశాఖపట్నంలోని కళాభారతి వేదికగా ఆవిష్కరించబడింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమం ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహకంగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం సందర్భంగా జరిగింది. ప్రఖ్యాత గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత కె.వి. రాజారావు మాట్లాడుతూ 'అంతర్మథనం'లోని ప్రతి కవిత సమాజాన్ని లోతుగా ఆవిష్కరించే సామాజిక స్పృహతో కూడి ఉందని పాఠకులను ఆలోచింపజేసే శక్తి కలిగివుందని తెలిపారు. 'అంతర్మథనం' గ్రంథంలో రచయిత ఎన్నో బహుమతులు అందుకున్న కవితలు చోటు చేసుకున్నాయని, ఈ కవిత్వం మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, ఆత్మ పరిశీలన వంటి అంశాలను ప్రతిబింబిస్తుందని గజల్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, సాంస్కృతిక వేత్తలు పాల్గొని కవిసమ్మేళనాన్ని విజయవంతం చేశారు.



సంప్రదాయంగా సాగుతున్న ఊరేగింపు

డిజెకు నో... సంప్రదాయానికి హలో

ప్రజాశక్తి- కవిటి

గణేష్ నిమజ్జనం అంటే డిజె సౌండ్లు, రంగుల కేళీలు, సినిమా పాటల నృత్యాలు. అయితే వాటివల్ల కలిగే ప్రమాదాలు, ఇబ్బందులను గుర్తించిన వరక మాదిన వీధి యువత ఈసారి కొత్త దారిని ఎంచుకుంది. ఆదివారం నిర్వహించిన నిమజ్జనోత్సవంలో డిజెకు బదులు సంప్రదాయ మేళతాళాలను రంగప్రవేశం చేయించారు. తాళం, మద్దెల దరువులతో ఊరంతా మార్మోగిపోతుండగా, భక్తి వాతావరణంలో గణపతి శోభాయాత్ర సాగింది. శబ్ద కాలుష్యం లేకుండా, ఆనందభరిత వాతావరణంలో పూర్తిగా సంప్రదాయాన్ని ఆచరించిన ఈ యువత ఇతరులకు స్ఫూర్తిగా నిలిచింది.

కృష్ణాపురంలో కబడ్డీ పోటీలు

పొందూరు: మండలంలోని కృష్ణాపురంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ పోటీలను ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు నగదు బహుమతులను అందజేయనున్నట్లు కమిటీసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, జనసేన జిల్లా కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు గార బాబూరావు, కూటమి నాయకులు గార లక్ష్మణరావు, కెల్ల నరసింహమూర్తి, కెల్ల పైడినాయుడు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఎనిమిది వందల ఎకరాలకు సాగునీరు అందించే నీలాదేవిపురం ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బూర్జ మండల రైతులతో కలిసి ఎత్తిపోతల పథకాన్ని, మరమ్మతులు చేయక నిరుపయోగంగా ఉన్న మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2008లో స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పథకం వలన బూర్జ మండలంలో నీలాదేవిపురం, బూర్జ, ఉవ్వపేట, కె.కె.రాజపురం, మామిడివలస గ్రామాల పరిధిలో సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందించేదని, గతేడాది వరకు నిరాటంకంగా పనిచేసి రైతాంగాన్ని ఆదుకొనే ఈ పథకం టిడిపి ప్రభుత్వం వచ్చాక మోటార్లకు మరమ్మతులు చేయక ఈ పథకం నిరుపయోగంగా మారిందన్నారు. రూ.5 లక్షలు వెచ్చిస్తే మరలా ఈ పథకం ఉపయోగంలోకి వస్తుందని, వ్యవసాయం దండగ అన్న చంద్రబాబుకు ఇవేమి పట్టవని, ఇప్పటికే రైతుభరోసా విషయంలో టిడిపి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రెండు సీజన్లకు కలిపి రూ. 40

ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న రవికుమార్ తదితరులు

వేలు ఇస్తామని చెప్పి రూ.5 వేలు ఇచ్చిందని, ఒక్క కట్ట యూరియా కూడా దొరక్క రైతాంగం చాలా ఇబ్బంది పడుతుందని అన్నారు. ఈ ఎత్తిపోతల పథకం విషయమై సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా తక్షణమే స్పందించి, మోటార్లకు మరమ్మతులు చేయించి ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బూర్జ వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, నీలాదేవిపురం సర్పంచ్ జల్లు ఆదినారాయణ, ఎంపిటిసి మజ్జి నర్సింగరావు, వైసిపి నాయకులు బట్న వెంకటనాయుడు, పోతిన రమేష్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బూర్జ

మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. ఆదివారం మండలంలోని కొరగాంలో కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడారు. శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామంలో రికార్డు లేని వాహనాలను సీజ్ చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు సూచనలను పాటించాలని, అలాగే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం పంచాయతీ పరిధిలోని తురకపేటలో ఆదివారం

బూర్జ : సీజ్‌చేసిన వాహనాలతో ఎస్ఐ ప్రవల్లిక, సిబ్బంది

సరుబుజ్జిలి : కార్డాన్‌సెర్చ్‌లో పాల్గొన్న ఎస్ఐ హైమావతి

తెల్లవారుజామున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ బి.హైమావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో గ్రామంలోని ప్రతి ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హైమావతి వాహనదారులకు పలు సూచనలు చేస్తూ పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్‌ను కాపాడుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న నాగేశ్వర శర్మ

నాగేశ్వరశర్మకు ప్రతిభ జ్యోతిష్య రత్న

ప్రజాశక్తి- రణస్థలం

ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు, ఆధ్యాత్మికవేత్త, పురోహితులు పట్నాల నాగేశ్వర శర్మకు ప్రతిభ జ్యోతిష్య రత్న అవార్డు దక్కింది. ఎచ్చెర్ల మండలం అల్లినగరం పంచాయతీ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన పట్నాల నాగేశ్వరశర్మ పండితులుగా ఈ ప్రాంతంలో ఎనలేని కీర్తిని సంపాదించారు. తన తండ్రి స్వర్గీయ పట్నాల వెంకట్రావు శర్మ వారసత్వంగా వచ్చిన జ్యోతిష్యాన్ని పురోహితంపై మంచి పట్టు సాధించారు. ఈ మేరకు విశాఖపట్నంకు చెందిన ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ నాగేశ్వరశర్మ సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసింది. నాగేశ్వర శర్మ విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి సహకరించిన పట్నాల అప్పల నరసింహులు శాస్త్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

ఇచ్ఛాపురం: మండలంలోని సవరదాయిపేట, పెటూరు గ్రామాల్లో వరసిద్ధి వినాయక వార్షికోత్సవంలో భాగంగా జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలు ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలో 50 గ్రూప్‌లు పాల్గొన్నాయి. విజేతలకు ఎంఇఒ అప్పారావు, అధ్యాపకులు బహుమతులను ఆదివారం అందజేశారు.

14న హిందీ దినోత్సవం

పలాస : ఈ నెల 14న హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని హిందీ ఫోరం జిల్లా సభ్యులు సంతోష్, కిరణ్, భానుమూర్తి, జగన్, సూర్యత అన్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో ఆదివారం దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పలాస, కాశీబుగ్గ హిందీ ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, శ్రీనివాస్ బాబ్జీ, విష్ణు, చిన్నారావు, సీతారాం, కల్పన, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పలాస : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఎమ్మెల్యే పరామర్శ

వజ్రపుకొత్తూరు: మండలంలోని గుణుపల్లిలో ఇటీవల మృతి చెందిన మాకుపల్లి నాని కుటుంబాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. మృతుని చిత్రపటానికి నివాళ్లర్పించి మృతుని కుటుంబ సభ్యులకు ఓదార్చి ధైర్యం చెప్పారు. టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, మోహనరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గన్‌మెన్, పలాస మండలం వీరభద్రపురానికి చెందిన తలగాపు శంకరరావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా మండలం గోపాలపురానికి చెందిన టిడిపి నాయకులు, రైతు యవ్వారి వైకుంఠరావు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఎమ్మెల్యే గౌతు శిరీష మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎంపిడిఒ దంపతులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

సేవలే గుర్తింపునిస్తాయి

పొందూరు: సేవలే గుర్తింపునిస్తాయని ఎంపిపి కిల్లి ఉషారాణి, అధికారులు, నాయకులు పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం ఎంపిడిఒ మీసాల మన్మధరావు ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులను, ప్రజా ప్రతినిదులను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఎంపిడిఒ దంపతులను దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. కూటమి నాయకులు, కూన వెంకటసత్యనారాయణ, చిగులపల్లి రామ్మోహనరావు, సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, శంకరభాస్కరరావు, వాసు, వైసిపి మండల అధ్యక్షుడు రమణమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, ఎపిఒ శ్రీనివాసరావు, కార్యదర్శుల సంఘం అధ్యక్షులు కె.మోహన్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మండలంలోని సన్యాసిపుట్టుగకి చెందిన సూరి శ్యాంసుందర్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబానికి పెద్దదిక్కు లేక భార్య, పిల్లలు ఏమిచేయాలో తోచక తల్లడిల్లిపోతున్నారు. విషయం తెలుసుకున్న లికేశుపురానికి చెందిన కాళీమాత సేవాసమితి సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు.

తైక్వాండో క్రీడాకారులకు వితరణ

పట్టణంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులకు మాజీ సైనిక ఉద్యోగి ఎల్.సి.రావు ఆదివారం ప్యాడ్స్ వితరణ చేశారు. కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఒక్కో హామీ అమలు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ఆదివారం స్త్రీ శక్తి పథకాలపై మహిళలతో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్రాన్ని కల్పించడానికి డ్వాక్రా వ్యవస్థను సృష్టించారని అన్నారు. ఇటీవల తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేశామన్నారు. కిడ్నీ ఆస్పత్రిలో అదనంగా డయాలసిస్ యూనిట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రూ.కోట్లు విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన విలువైన పరికరాలు, సిటీ స్కాన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వంటి ఆధునిక వసతులను కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, ఎపిఎం జాంబవతి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: కార్డులను పంపిణీ చేస్తున్న భాస్కర్‌గౌడ్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ సరుకులను పారదర్శకంగా అందించాలని లక్ష్యంతోనే ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చిందని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ అన్నారు. మండలంలోని జోడూరులో ప్రభుత్వం క్యూఆర్

స్మార్ట్ కార్డులు పంపిణీ

కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల నుంచి ఈ కార్డుల ద్వారా బియ్యం పొందవచ్చునని, ఈ పాస్ యంత్రాలను కూడా అందుబాటులోకి ప్రభుత్వం తెస్తుందని అన్నారు. ఈ యంత్రంలో పరిశీలిస్తే చేస్తే కార్డుదారుల వివరాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజయ్ కుమార్ నాయక్, రఘునాథ్‌గౌడ్, రఘునాథ్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

కవిటి: రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించేందుకే ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తోందని పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ అన్నారు. మండలంలోని చిన్న మునిపుట్టుగలో డిజిటల్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

వేలం అదిరింది... ధర కుదిరింది

కవిటి : లడ్డూతో కృష్ణారావు టీం

కవిటి : లడ్డూతో చంద్రయ్య

ప్రజాశక్తి - కవిటి

మండలం లోని వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న లడ్డూ వేలం పోటా పోటీగా సాగుతోంది. దీంతో అధిక ధరలకు లడ్డూ విక్రయాలు సాగుతు న్నాయి. మండ లంలోని కె.కపాసుకుద్దిలో నిర్వహించిన లడ్డూ వేలంలో తెప్పల కృష్ణారావు టీం రూ.67,100లకు పాడగా, కొత్తపుట్టుగ బంగారి వీధిలో నిర్వహించిన లడ్డు వేలంలో మొదటి లడ్డు గ్రామానికి చెందిన నర్తు చంద్రయ్య రూ.65, 000లకు దక్కించు కోగా, రెండో లడ్డు నర్తు తిరుపతి రూ.16 వేలకు దక్కించు కున్నారు. కేసుపురం కొప్పల వీధిలో కొప్పల సంతోష్ రూ. 50,100కు, భైరిపురం సప్పవీధిలో నట్టు రామస్వామి రూ. 44,500లకు లడ్డు కైవసం చేసుకున్నాడు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలం లోని వినాయక మహోత్స వాల్లో భాగంగా ఒండ్రుజోలకు చెందిన రేగన ఆదినా రాయణ, నవీన దంపతులు 111 కేజీల లడ్డును సమర్పించారు. ఈ లడ్డూను వేలం పాట వేయగా, అదే గ్రామానికి చెందిన పెనుగు దురు రాము, అదినారాయణ బ్రదర్స్ రూ.30 వేలకు దగ్గించు కున్నారు. నిర్వాహకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: లడ్డూ దక్కించుకున్న వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కలెక్టర్ దృష్టికి ఎత్తిపోతల సమస్యలు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండలం ఉవ్వపేట గ్రామం నాగవల్లి నది తీరం వద్ద నీలాదేవిపురం ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారని ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు అన్నారు. ఆదివారం కూటమి నాయకుల బృందంతో వాటర్ షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో శంకుస్థాపన చేసి 2018లో ప్రారంభమైందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నీలాదేవిపురం ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందించి నీలాదేవిపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మూడు మోటార్లు, పంపులు పూర్తిగా పనిచేయడం లేదని, ఎలక్ట్రికల్ సిస్టమ్ పూర్తిగా దెబ్బతిందని,

మాట్లాడుతున్న రామకృష్ణనాయుడు

ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే మరమ్మతులకు అవసరమైన అంచనాలన్ని ఇరిగేషన్ సిబ్బంది ద్వారా తయారు చేయించి జిల్లా కలెక్టర్‌కు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ లేఖ రాయడం జరిగిందన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు లంక జగన్నాథనాయుడు, పీరుకట్ల ప్రభాకరరావు, కడగల కృష్ణ, స్వామి నాయుడు, కత్తెర అశోక్, పోలినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొందూరు : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

పలుచోట్ల అన్నదానాలు

వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొందూరు: మండలం రాపాకలో వినాయకచవితి మహోత్సవాలు సందర్భంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రంలో వినాయకుని వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గోగుల్ కాంప్లెక్స్, కొత్తపేట కాలనీ, నేతాజీ నగర కాలనీల్లో అన్నదానం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి ఐదు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గోగుల బాలచంద్ర, గండివలస ధర్మారావు, దూబ రాములు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని నందిగాం ఎస్‌సి కాలనీ, దిమ్మిలాడ, తురకలకోట, దేవలభద్ర, జల్లిపల్లి, వెజ్‌పల్లి గ్రామాల్లోని

కొత్తూరు: అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

మాజీ సర్పంచ్ మృతి

వజ్రపుకొత్తూరు: మండలంలోని రాజాం పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రస్తుతం, ఎంపిటిసి ప్రతినిధి పిట్ట రామారావు (57) ఆదివారం మృతి చెందారు. ఈయన 2001-06 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతిపై మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైసిపి నాయకులు పాలిన శ్రీనివాసరావు, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, గురయ్యనాయుడు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసిపి కోసం కష్టపడి పనిచేసే నాయకుడును కోలిపోవడం బాధాకరమని అన్నారు.

రామారావు (ఫైల్)

నివాళ్లర్పిస్తున్న విప్ అశోక్

మాజీ ఎమ్మెల్యే భార్య అంత్యక్రియలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు దక్కత అచ్యుత రామయ్యరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అంత్యక్రియలు బిర్లాంగతోటూరులో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జీ, దక్కత ఢిల్లీరావు, సాలీనా ఢిల్లీ, మెరుగు సూర్యనారాయణరెడ్డి, దుపాన సూర్యనారాయణరెడ్డి, సహదేవ్‌రెడ్డి, ప్రకాశ్ నాయక్, లీలారాణి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సేవారంగ యోధులు.. అభివృద్ధి వారధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దేహానికి ఆరోగ్యం ఎంత అవసరమో దేశానికి సేవా సౌభాగ్యం కూడా అంతే అవసరమని, సేవారంగంలో అంకిత భావంతో కృషిచేసి అందరి మన్ననలు పొందిన వారిని స్టార్ వాకర్స్‌క్లబ్ గౌరవించడం ఎంతో అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవారంగ సారథులకు జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉదయం నడక ఆరోగ్యానికి చాలా అవసరమని, వ్యాయామం మానవ శరీరానికి రోగనిరోధక శక్తిని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కొంక్యాన మురళీ మోహన్, వావిలపల్లి జగన్నాథనాయుడు, గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, పి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతతో నిర్వాహకులు

భగవద్గీత పోటీల విజేత శ్రీవిష్ణుప్రియ

ప్రజాశక్తి- కవిటి

అగ్నికుల క్షత్రియ వీధిలో గణేష్ మహోత్సవాల్లో భాగంగా యువత ఆధ్వర్యాన ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బెజ్జిపుట్టుగకు చెందిన మాదిన శ్రీవిష్ణుప్రియ ప్రథమ బహుమతి గెలుచుకోగా, బెజ్జిపుట్టుగకు చెందిన బి.శ్రీగాయత్రి ద్వితీయ బహుమతి, బొరివంకకు చెందిన డి.వెంకట హరిణి తృతీయ బహుమతిని అందుకున్నారు. ఉమామహేశ్వర మాస్టారు, యజ్ఞానంద్ మాస్టారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఈ పోటీల్లో ఆరింగి త్రివిక్రమరావు, పొల్లాయి వాసు, తెప్పల మోహనరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పొల్లాయి మోరేసు రుద్రయ్య, శ్రావణ్ కుమార్, స్థానిక యువతకు అతిథులు అభినందనలు తెలిపారు.

'తెప్పల'కు పురస్కారం

పలాస: తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని పల్నాడు జిల్లా నరసారావుపేట భువన చంద్ర టౌన్ హాల్ ఆదివారం కళావేదిక 154వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలాసకు చెందిన సీనియర్ రచయిత, కళాకారుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి తెలుగు తేజం పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. శ్రీనాథుని, గుర్రం జాషువా, పింగళి వెంకయ్య వారసులు పాల్గొన్నారు.

కాశీనగర్‌లో 'స్వపరిపాలన దినం'

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్‌లో ఆదివారం స్థానిక స్వపరిపాలన దినం స్వర్ణోత్సవాలు నిర్వహించారు. కాశీనగర్ పంచాయతీ నుంచి ఎన్ఎసిగా మారి ఏభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, సబ్ కలెక్టర్ అనుప్ పండా, తహశీల్దార్ సుధీర్ కుమార్ నంద పాల్గొన్నారు. కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ఉపాధ్యక్షులు రఘురామ్ సాహు, కార్యనిర్వహణ అధికారి భగవత్ సాహు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.